క్లుప్తంగా

రాజకీయ పార్టీ నాయకులతో కమిషనర్ సమావేశం



నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్

కోరుట్ల: పట్టణంలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులతో మున్సిపల్ కమిషనర్ రవీందర్ సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో సమస్యలను నాయకులు కమిషనర్‌కు వివరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు నయీం, బీఆర్ఎస్ నాయకులు సజ్జు, ఫయీం, బీజేపీ నాయకుడు మాడవేణి నరేశ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో కీలక పోస్టులు భర్తీ చేయాలి

రాయికల్: విద్యాశాఖలో కీలక పోస్టులు భర్తీ చేయాలని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర కన్వీనర్ ముక్కెర శేఖర్ అన్నారు. సోమవారంబ మాట్లాడారు. పాఠశాలల్లో ఎంఈవో పోస్టులు, ఉప విద్యాధికారుల పోస్టులు భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కీలక పోస్టులన్నీ ప్రభుత్వం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో 70 శాతం అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు గెజిటెడ్ హెడ్మాస్టర్లకు ప్రమోషన్లు కల్పించాలని కోరారు.

టికెట్ల రేట్లను తగ్గించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో పెంచిన టికెట్ల రేట్లను తగ్గించాలని కోరుతూ దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌కు సోమవారం బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. స్వామి దర్శనానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారని, శ్రావణమాసం సందర్భంగా శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి నిర్వహించే రుద్రాభిషేకం, అభిషేకం టికెట్లు 516 రూ.లు ఉండేవి. ప్రస్తుతం అట్టి రేట్లక రెట్టింపుగా వెయ్యి రూ.లు పెంచారని, ఈ టికెట్ల రేటును యథావిధిగా కొనసాగించాలని కోరారు. టికెట్ల రేట్లను తగ్గించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు గాజు భాస్కర్ నాయకులు లవన్‌కుమార్, రవికుమార్, బాకి అనిల్, మధుసుధన్ తదితరులున్నారు.

గోదావరి పరీవాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి




ఎర్దండి వద్ద గోదావరిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఇబ్రహీంపట్నం: గోదావరి పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని ఎర్దండి వద్ద గోదావరిని పరిశీలించారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లను వేగంగా నిర్మించాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రదాని ఆవాస్ యాప్‌లో ఇందిరమ్మ లబ్ధిదారుల వివరాలను వేగవంతంగా నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులను కోరారు. కార్యక్రమంలో ఎంపీవో రామకృష్ణరాజు, గంగమాత ఆలయ కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైద్య కిట్లు అందుబాటులో ఉంచుకోవాలి

రాయికల్: వర్షాకాలం ప్రారంభం నేపథ్యంలో వైద్య సిబ్బంది వైద్య కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని ఎంపీడీవో చిరంజీవి సూచించారు. సోమవారం రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నర్సరీ పనులను పరిశీలించారు.

వీరాపూర్ ప్రథమ సర్పంచ్ మృతి



గంగారాం

రాయికల్: రాయికల్ మండలంలోని వీరాపూర్ గ్రామ ప్రథమ సర్పంచ్ బొలిశెట్టి గంగారాం (80) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. ఆయన 1981 నుంచి 1988 వరకు సర్పంచ్‌గా సేవలందించారు. ఆయన మృతిపట్ల మాజీ సర్పంచులు సంతాపం వ్యక్తం చేశారు.

గూడు తొలగించారు.. ఆదుకోండి సారు

- వైఎస్సార్ పట్టాలిస్తే.. కష్టపడి ఇళ్లు కట్టుకున్నం
- ఇందిరమ్మ రాజ్యమంటూనే ఇల్లు కూల్చివేసింద్రు
- ప్రజావాణిలో ఇందిరమ్మ ఇళ్ల బాధితుల మొర





ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చిన బాధితులు (కూల్చక ముందు సలీమా ఇల్లు ఇన్‌సెట్‌లో)

జగిత్యాలటౌన్: రెక్కల కష్టంతో పైసా పైసా కూడబెట్టి కట్టుకున్న తమ ఇళ్లను బల్దియా అధికారులు నేలమట్టం చేశారని నిరుపేదలు కన్నీరు మున్నీరవుతున్నారు. అప్పో సప్పో చేసి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని సొంత ఇంటిలోకి అడుగుపెట్టాలన్న వారి కల కల గానే మిగిలిపోయింది. తమ ఆవేదనను సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించారు.

2008లో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జగిత్యాల పట్టణ సమీపంలో రాజీవ్ అర్బన్ కాలనీ(నూకపల్లి)లో సుమారు 4000 వేల ఇళ్లకు పట్టాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించిన ఆర్థికసాయంతో ఇల్లు పూర్తి కాక పనులు నిలిచిపోయాయి. కొందరు మాత్రం తాము కూడబెట్టుకున్న కొద్ది పాటి డబ్బుతో నిర్మాణాలు చేసుకున్నారు. కొన్ని ఇళ్లకు స్లాబులు పడగా, మరికొన్ని లెంటల్ లెవల్, మరికొన్ని పునాదుల స్థాయిలో ఉన్నాయి. ఏనాటికైనా ఇళ్లను పూర్తి చేసుకుని సొంత ఇంటి కల నెరవేర్చుకుంటామని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇంతలో ఏమైందో తెలియదు కాని రెండు రోజుల క్రితం తెల్లవారే సరికి వందకు పైగా ఇందిరమ్మ ఇళ్లను బల్దియా అధికారులు నేలమట్టం చేశారు. దీంతో బాధితులు ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారి నుంచి ఏలాంటి హామీ లభించకపోవడంతో ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసి, ఆదుకోవాలని వేడుకున్నారు. వీరే కాదు కూల్చివేతల్లో ఇళ్లు కోల్పోయిన వందకు పైగా బాదితులందరిదీ ఇదే పరిస్థితి. ఇల్లు కోల్పోయిన తమకు తిరిగి ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సిందిగా వారు కలెక్టరును వేడుకున్నారు.

ఇంటికి బదులు ఇల్లివ్వాలి



నాపేరు సలీమా వీక్లీ బజారులో అద్దెకుంటున్నాం. 2008లో రాజీవ్ అర్బన్ కాలనీలో నాకు డ్రా పద్ధతిలో డీ/113ప్లాట్ కేటాయించారు. ప్రభుత్వం నుంచి అందిన రూ.67,000 నా సొంత డబ్బులు రూ.6లక్షలు ఖర్చు చేసి హాలు బెడ్‌రూం కిచెన్‌తో ఆర్‌సీసీ నిర్మాణం పూర్తి చేసుకున్నాను. ఆర్థికంగా లేక పనులు నిలిచిపోయాయి. కానీ శనివారం నాకు ఏలాంటి సమాచారం లేకుండా నా ఇంటిని కూల్చి వేశారు.

– సలీమా, వీక్లీ బజార్ జగిత్యాల

ఆదుకోకపోతే అధోగతే



నా పేరు వేముల శశికళ, భర్త గంగారాం మేం నిరుపేదలం. ఇంటి అద్దె కట్టడానికి కష్టమవుతున్న తరుణంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం డీ/103 నంబర్‌తో ప్లాటు కేటాయించారు. లెంటల్ లెవల్ వరకు ఇల్లు పూర్తి చేశాను. కానీ అధికారులు కనీస సమాచారం లేకుండా శనివారం నా ఇంటిని కూల్చివేశారు.మా కుటుంబానికి ఉన్న ఒకే ఒక ఆస్తి ఇల్లు. మీరే దారి చూపాలి లేదంటే మా కుటుంబ పరిస్థితి అదోగతే అవుతుంది.

– వేముల శశికళ జగిత్యాల

న్యాయం చేయాలి



2008లో అప్పటి ప్రభుత్వం నాకు డీ/133 ప్లాట్ కేటాయించింది. ప్రభుత్వ సాయం, సొంత డబ్బులతో స్లాబ్ లెవల్ వరకు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. రాబోయే రోజుల్లో ఇంటిని పూర్తి చేసుకుందామని ఆశతో ఉన్నాం. అప్పటి ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇంటిని ఇప్పటి ఇందిరమ్మ రాజ్యంలో అధికారులు కూల్చి వేసి తీరని అన్యాయం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటికి బదులు ఇల్లు ఇప్పించి ఆదుకోవాలి.

– దాత్రిక జ్యోతి. జగిత్యాల

రోడ్డు బాగు చేయాలని ధర్నా



రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు, విద్యార్థులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం చెర్లపల్లి గ్రామానికి వచ్చే రోడ్డు అధ్వానంగా మారడంతో కొన్ని నెలలుగా గ్రామానికి బస్సులు రావడం లేదని గ్రామస్తులు, విద్యార్థులు సోమవారం రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. గ్రామానికి వచ్చే రోడ్డు అస్తవ్యస్తంగా మారడంతో గ్రామానికి బస్సులు రావడం లేదని, ఇతర ప్రాంతాలకు రోజు వెళ్లి చదువుకునే విద్యార్థులతో పాటు, వేరే ప్రాంతాలకు వెళ్లే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి దృష్టికి తీసుకురావడానికి ధర్నా చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వేల్పుల రాజేశ్, ప్రభాకర్, అజిత్, అశోక్, సాయికుమార్, సురేశ్, సుశాంత్, ఉజవ్వ, లక్ష్మీ, స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ రోడ్డు పనులు ప్రారంభించాలి



ఎంపీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కథలాపూర్: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ బీజేపీ నాయకులు ఎంపీడీవో శంకర్, ఎంపీవో రాజశేఖర్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ రోడ్డు పనులకు ప్రభుత్వం రూ. 1.30 కోట్లు మంజూరు చేసిందని, పనులకు భూమిపూజ చేసి 8 నెలలు గడిచిందన్నారు. అయినప్పటికీ పనులు ప్రారంభించకపోవడంలో ఆంతర్యమేమిటని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. వర్షం కురిస్తే ఈ రోడ్డు గుండా విద్యార్థులు వెళ్లడానికి ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు దృష్టిసారించి రోడ్డు పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, నాయకులు గాంధారి శ్రీనివాస్, ధర్మపురి జలంధర్, గడ్డం జీవన్‌రెడ్డి, కల్లెడ ప్రసాద్, ప్రతాప్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు అందిస్తున్న విద్యార్థినులు, అధ్యాపకులు

జగిత్యాల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందజేయాలంటే ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్ అన్నారు. సోమవారం వన మహోత్సవంలో భాగంగా విద్యార్థులు ప్రజలకు మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలంటే ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, ప్రస్తుత హైటెక్ యుగంలో వనమంతా నశించిపోతుందని, కాలుష్యం పెరిగిపోతోందన్నారు. అనంతరం బస్టాండ్‌లో ప్రజలకు మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రయ్య, డాక్టర్ వరప్రసాద్, వాసవి, నీరజ, రాంచంద్రం, మల్లికార్జున్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన



అంగన్‌వాడీ కేంద్రంలో ఏసీడీపీవో

పెగడపల్లి: మండలంలోని బతికపల్లిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం మల్యాల ఏసీడీపీవో అరవింద సందర్శించారు. కేంద్రాల్లోని చిన్నారుల హాజరు రిజిస్టర్, సరుకులను పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో ఆరోగ్య భద్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చిన్నారులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్

జగిత్యాల: బీడీ కార్మికుల పిల్లలు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని పురాణిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1–10వ విద్యార్థులు ఆన్‌లైన్ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో అక్టోబర్ 31 వరకుదరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, నోడల్ ఆఫీసర్ రమణచారి, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహుల పల్లె గ్రామానికి చెందిన కౌసర్ అనే యువకుడు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, చికిత్స కోసం సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే రూ. 2.50 లక్షల విలువ చేసే ఎల్‌వోసీని బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కౌసర్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్ ఉన్నాడు.

పాఠశాలల్లో నిలిచిన మధ్యాహ్న భోజనం

రాయికల్: మధ్యాహ్న భోజన నిర్వాహకులు సమ్మెలో ఉండడంతో మండలంలోని 17 ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండలేదు. దీంతో విద్యార్థులే స్వయంగా ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకున్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె ఉండటంతో ఇతరులతో మధ్యాహ్న భోజనం నిర్వహించేందుకు ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని సబ్ రిజిస్ట్రార్‌కు వినతి

మెట్‌పల్లి: పట్టణంలోని మెట్‌పల్లి క్లబ్‌కు చెందిన స్థలాన్ని అక్రమంగా విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారని, దీనిని వెంటనే రద్దు చేయాలని కోరుతూ పలువురు సభ్యుల కుటుంబీకులు సోమవారం సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. మృతి చెందిన సభ్యుల వారసులకు సమాచారం ఇవ్వకుండా విక్రయించారని, దీనిని దృష్టిలో పెట్టుకుని రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

చెక్కులు పంపిణీ

మేడిపల్లి: మండల కేంద్రానికి చెందిన సాంబరి జగదీశ్‌కు రూ.60 వేల చెక్కు మంజూరు కాగా, మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మేదరి లాజర్, బలగం రాజేశ్, మార్గం నర్సారెడ్డి, ఉరుమడ్ల నర్సయ్య, మార్గం నవీన్, తోట రాజేందర్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రీన్ డే



ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని కాకతీయ విద్యాలయ విద్యార్థులు గ్రీన్ డే వన మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పచ్చని రిబ్బన్లు కట్టుకుని పచ్చని బెలూన్లను చేతబట్టుకుని ర్యాలీ నిర్వహించి ఆనంతరం స్కూల్ అవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాపల్లి సంజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గన్నారు.



బుగ్గారం: వర్షాకాలం వచ్చిందంటే మండలంలోని పలు రోడ్లు బురదమయంగా మారి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రహదారులు పూర్తిగా అధ్వానంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది అవుతోంది. దీనికి తోడు రోడ్లపై కేజ్ వీల్స్ వెళుతుండడంతో రోడ్లు మరింత అధ్వానంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాలలో రహదారులను అభివృద్ధి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఏ.శేఖర్, పంచాయతీ కార్యదర్శి, నాచుపల్లి, సెల్ నంబర్ : 9676138013

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఆలయాల్లో శ్రావణమాస పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులోని సహస్ర లింగాలయ దేవాలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కథలాపూర్: మండలంలోని తాండ్య్రాల, చింతకుంట, భూషణరావుపేట గ్రామాల్లోని మార్కండేయ స్వామి, తారకేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం భక్తులు శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. శివుడికి వేకువజామున అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు ప్రత్యేకంగా పూజలు, భజనలు చేశారు.

కేజీబీవీలో నేడు ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

సారంగాపూర్: సారంగాపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో మంగళవారం ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి వీణ తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి గాను సీఈసీ విభాగంలో 28 సీట్లు, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 22 సీట్లకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఏఎంసీ చైర్మన్‌కు పరామర్శ

మల్లాపూర్: మండలంలోని గుండంపల్లిలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత సమీప బంధువు ఇటీవలే మృతి చెందగా, ఆమె కుటుంబాన్ని సోమవారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు మామిడి లక్ష్మారెడ్డి, భూపెల్లి దేవయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంతడుపుల నర్సయ్య, గంగాధర్ తదితరులు ఉన్నారు.

జైపాల్‌రెడ్డికి నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: కేంద్ర మాజీ మంత్రి ఉత్తమ పార్లమెంటరీయన్, ఎస్.జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్‌లోని స్ఫూర్తి స్థల్‌లో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నివాళి అర్పించారు.

తహసీల్దార్ కార్యాలయంలో అందని సేవలు



గొల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం

గొల్లపల్లి: మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు అందాల్సిన సేవలు కొరవడ్డాయి. అధికారులు అందుబాటులో లేక పాలన స్తంభించిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.సకాలంలో సర్టిఫికెట్లు మంజూరు కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో రుణాలకు అవసరమైన పత్రాల కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.అధికారులు లేక పోవడంతో అవస్థలు పడుతున్నారు.

శని,సోమవారం నిలిచిన రిజిస్ట్రేషన్ సేవలు..

తహసీల్దార్ వరందన్‌కు ఫీవర్ రావడంతో శని,సోమవారం రెండు రోజులుగా భూముల రిజిస్ట్రేషన్ సేవలు నిలిచి పోయాయి.తహసీల్దార్ అందుబాటులో లేనప్పుడు ఆయన స్థానంలో రిజిస్ట్రేషన్ చేసే బాధ్యత డిప్యూటీ తహసీల్దార్‌కు ఉంటుంది.అయితే ఇక్కడ పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ నిజమాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లడంతో ఇంకా ఎవరిని నియమించలేదు. రెండు నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉంది.తహసీల్దార్ అందుబాటులో లేనప్పుడు భూముల రిజిస్ట్రేషన్ చేసే డిప్యూటీ తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటంతో రిజిస్ట్రేషన్ సేవలు నిలిచి పోతుండంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.రెండు రోజులుగా రిజిస్ట్రేషన్ సేవలు నిలిచి పోవడంతో సుదూర ప్రాంతాలకు ఉద్యోగ రీత్యా వెళ్లి రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారికి చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సీనియర్ అసిస్టెంట్ కలెక్టర్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లడంతో సమస్యగా మారింది. ఇక సాధారణ సమస్యలు,భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి కార్యాలయానికి వస్తున్నవారు అధికారులు లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగుతున్నారు.ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.